గృహసారథులే విజయ వారధులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు


శిక్షణకు హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

- ప్రజల్లోకి విస్తృతంగా పథకాలు తీసుకెళ్లండి
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు


గృహసారథులకు కిట్లు అందజేస్తున్న కె.కె.రాజు, హర్షవర్ధన్‌రెడ్డి

సీతంపేట: 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ 14, 24, 25 వార్డులకు సంబంధించి జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు శిక్షణ కార్యక్రమం అబిద్‌నగర్ షాదీఖానాలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీకి చేరువయ్యేలా కృషి చేయాలన్నారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టండి..

రాష్ట్ర జేసీఎస్ ఉత్తరాంధ్రా కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కటై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేస్తున్నాయన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను చేరవేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రతిపక్ష పార్టీలు ఎక్కడికక్కడ అడ్డుపడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దూరాన్ని పెంచుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం, అభివృద్ధి కార్యక్రమంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తిప్పికొట్టేలా ప్రజలకు వాస్తవాలను వివరించాలన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల విధులపై అవగాహన కల్పించి కిట్లు అందజేశారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు చిక్కాల రామారావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, కె.అనిల్‌కుమార్‌రాజు, మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు జి.వి.రమణి, నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం


శిక్షణకు హాజరైన స్కౌట్ మాస్టర్లు

సీతంపేట: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శనివారం స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు, రోవర్ స్కౌట్ లీడర్లు, రేంజర్ లీడర్ల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కళాశాల, పాఠశాలలో తప్పనిసరిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థాపించాలని సూచించారు. రాష్ట్ర శిక్షణాధికారులు బి.ఉమాదేవి, మోహన్‌రావు శిక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. రేంజర్ విభాగం నుంచి 45 మంది, స్కౌట్స్ విభాగం నుంచి 55 మంది శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యక్షుడు నరవ ప్రకాశరావు, రాష్ట్ర కమిషనర్ శకుంతల, క్యాంప్ లీడర్ ఎస్.వెంకటేశ్వర్లు, శిక్షకులు పి.సుశీల, డి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌర గ్రంథాలయంలో క్విజ్ పోటీ


విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం క్విజ్ పోటీ నిర్వహించారు. 50 మంది విద్యార్థులు 8 గ్రూపులుగా పాల్గొన్నారు. వర్తమాన అంశాలు, ఆర్థిక భూగోళ వైజ్ఞానిక, చరిత్ర సంస్కృతి. కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జికి సంబంధించిన ప్రశ్నలను సంధించారు. ఎనిమిది రౌండ్లలో జరిగిన పోటీలో మొత్తం 60 ప్రశ్నలను టీమ్ సభ్యులను అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. పోటీ విజేతలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళా శాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు కె.కాలనీ హైస్కూల్ విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన కొలుసు నిహారిక, రొంగలి పల్లవి

మురళీనగర్: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు 49వ వార్డు అల్లూరి సీతారామరాజునగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం సాయిలక్ష్మి తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో కొలుసు నిహారిక, రొంగలి పల్లవి పాల్గొని తమ ప్రతిభను చూపారన్నారు. 50–52 కేజీల విభాగంలో నీహారిక, 53–56 కేజీల విభాగంలో పల్లవి సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థినులను హెచ్‌ఎం సాయిలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయిని కె.స్వరూపారాణి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి స్వాధీనం

మల్కాపురం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి పట్టుకున్నట్టు సమాచారం. రామ్మూర్తిపంతులు పేట ప్రాంతంలో శనివారం ఆటోలో గంజాయి తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. తరలించడానికి సిద్ధంగా ఉన్న సుమారు 30 కేజీల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారని సమాచారం. అయితే ఎంత గంజాయిని, ఎవరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారో అనే పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేశాక పూర్తి వివరాలు తెలిసే అవకాశముంది.

రైతుబజార్లలో సకల సదుపాయాలు

- ఈ–ఆప్షన్ ద్వారా స్టాళ్ల కేటాయింపు
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే


సీతమ్మధార రైతుబజారులో ఆకుకూరల రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ రాహుల్ పాండే

సీతమ్మధార: రైతులకు అనువుగా ఉండేలా రైతుబజార్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే తెలిపారు. సీతమ్మధార రైతుబజారును శనివారం ఆయన సందర్శించారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి ఐడీ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ–ఆప్షన్ విధానం ద్వారా త్వరలో రైతులను మార్చే ప్రక్రియ, స్టాళ్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని, స్నేహపూర్వక సేవలందించాలని రైతులకు సూచించారు.

పార్కింగ్‌పై అధికారులతో చర్చిస్తాం..

రైతుబజారు చిన్నది కావడం, స్థలం లేకపోవడంతో పార్కింగ్ సమస్య ఉన్న మాట వాస్తవమేనని రాహుల్ పాండే అన్నారు. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి పార్కింగ్ సదుపాయంపై దృష్టి సారిస్తామని తెలిపారు. బజారు లోపల స్టాళ్లు, ప్రధానంగా గేటు, ఇతర పనులకయ్యే ఖర్చు అంచనా వేసి మరికొద్ది రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. రైతుబజారులో కమిషనర్ పరిశీలిస్తున్న సమయంలో ఆకుకూరల స్టాల్ వద్ద ధరల పట్టికపై ధరలు కనిపించకపోవడంతో రైతుతో బోర్డుపై రాయించారు. మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంచాలకుడు పి.సుధాకర్, ఉప ప్రాంతీయ సంచాలకుడు ఎర్రన్న, వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్, ఇంజినీరింగ్ శాఖ డీఈ కెనడీ, మార్క్‌ఫెడ్ జీఎం రమేష్, గోవింద్, రైతుబజారు ఈవో పి.కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ


త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న వందన

సీతంపేట: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకులు నిష్ఠల కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో డాక్టర్ కె.వందన చేసిన గాత్ర సంగీత కచేరీ ఆహుతులను అలరించింది. తిరుపతి శ్రీవెంకటేశ్వర సంగీత కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న వందన తన అద్భుత గాత్రంతో వీనుల విందు చేశారు. నన్ను విడచి కదలకురా అనే రీతి గౌళ రాగకృతి, నే పొగడకుంటే అనే శుభపంతువరాళి రాగకృతి, స్వరరాగసుధ అనే శంకరాభరణ రాగకృతి కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి మంథా శ్రీరమ్య వయోలిన్‌పై, పి.ఎస్.ఫల్గుణ మృదంగంపై వాద్య సహకారం అందించారు. త్యాగరాజ ఉత్సవాల సందర్భంగా పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథి మృదంగ విద్వాంసుడు వంకాయల వేంకట రమణమూర్తి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు.

నేత్రపర్వం.. లలితాకామేశ్వరుల గ్రామోత్సవం


పల్లకీపై లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


ప్రత్యేక రథంపై లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠం 74వ వార్షిక బ్రహ్మోత్సవాలు పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో రెండు వారాలుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం లలితా కామేశ్వరుల గ్రామోత్సవం పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను చూడముచ్చటగా అలంకరించి పల్లకీపై భక్తులు ఊరేగించారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని ప్రత్యేక రథంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని పర్యవేక్షణలో మహిళలు పెద్ద సంఖ్యలో రథయాత్రలో పాల్గొన్నారు.

అమ్మవారికి భక్తుల నీరాజనాలు..

లలితానగర్‌లోని లలిత గుడి వద్ద ప్రారంభమైన ఊరేగింపు శంకరమఠం రోడ్, డైమండ్ పార్కు, దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. విద్యుత్ దీపాలు, అలంకరణ, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఊరేగింపులో భక్తులు వేలాదిగా వెంటరాగా, అమ్మవారికి అడుగడుగునా భక్తులు హారతులిచ్చి, టెంకాయలు కొట్టి నీరాజనాలు పలికారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు పీఠంలో కాళీ కాలభైరవుల ప్రతిష్ఠ, విశేష పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కార్యక్రమంలో పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్ శర్మ, సీతంపేట మోచర్ల శశిభూషణ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కొలువుదీరిన గౌరీ సేవా సంఘ కొత్త కార్యవర్గం

సీతంపేట: శ్రీ గౌరీ సేవా సంఘం(అక్కయ్యపాలెం మూడుగుళ్లు) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం అట్టహాసంగా జరిగింది. 2023 నుంచి 2025 వరకు కొత్త కార్యవర్గం ఉంటుంది. గోలీలపాలెం శతకంపట్టు రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి కాండ్రేగుల వెంకటేశ్వరరావు, ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా పాలమరశెట్టి ఎస్.జె.వి.ప్రసాద్, చైర్మన్‌గా రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్‌గా మళ్ల త్రినాథరావు, అధ్యక్షుడిగా కొయిలాడ వేణుగోపాల్, డిప్యూటీ ప్రెసిడెంట్‌గా పిల్లా పకీర్ నాయుడు, కార్యదర్శిగా ఆడారి పారుపల్లి రవి, ముఖ్య సలహాదారుడిగా పెంటకోట సత్యనారాయణ, లీగల్ రైటర్‌గా పెంటకోట సంజీవరావు నాయుడు, సంయుక్త కోశాధికారిగా పాలమరశెట్టి చక్రవర్తితోపాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, నలుగురు ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బొడ్డేటి రాము, దేముడమ్మ, కొయిలాడ శంకర్ నారాయణ, గోవిందరాజు, పాలమరశెట్టి బాలు, బొడ్డేటి అప్పారావు, నాని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న దంత వైద్యులు

సీతంపేట: శ్రీసత్యసాయి సేవా సమితి(రైల్వే ఏరియా) ఆధ్వర్యంలో శనివారం సాయిసాధ మందిరంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ వైద్య సిబ్బంది దంత పరీక్షలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 80 మంది వైద్య సేవలు పొందారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పి.వి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు వైద్య శిబిరాన్ని ప్రారంభించగా.. సమన్వయకర్త డి.రాఘవరావు, సేవాదల్ కో ఆర్డినేటర్ నాయుడు, రైల్వే ఏరియా సేవా సమితి కన్వీనర్ పి.మోహనరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వాకర్స్ సేవలు శ్లాఘనీయం


మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవీంద్ర

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు శ్లాఘనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం సాయంత్రం నిర్వహించిన క్లబ్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. వాకర్స్ క్లబ్ సభ్యులు నిస్వార్థంగా సేవలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారన్నారు. నడక ప్రాధాన్యాన్ని తెలుపుతూనే ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.బాబూరావు రచించిన నాలో నేను అనే కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ యు.శుభ, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, డాక్టర్ కె.బాబూరావు, కె.ద్వారకానాథ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

కలియుగ వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పబ్లిక్ డిమాండ్

నిరుపయోగంగా బోరు


మారుతీ నగర్‌లో పనిచేయని బోరు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు మారుతీనగర్‌లో 11/27 నంబర్ గల బోరు చాలా కాలంగా పని చేయడం లేదు. దీంతో నీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. గతంలో ఈ బోరు నుంచి ఇంటి అవసరాల నిమిత్తం నీరు పట్టుకెళ్లేవాళ్లం. ప్రస్తుతం అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారింది. సంబంధిత అధికారులు పరిశీలించి బోరును వినియోగంలోకి తీసుకురావాలి.

– మారుతీ, నగర్ వాసులు

పైపుల లీకు.. తాగునీరు వృథా


నక్కవానిపాలెంలో వృథాగా పోతున్న నీరు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో తాగునీరు వృథాగా పోతోంది. జీవీఎంసీ వాటర్ సప్లై విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కుళాయిలు లీకై నీరు కాలువల్లోకి ప్రవహిస్తోంది. వారం రోజులుగా తమ ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన కుళాయి పైప్‌లైన్ల నుంచి నీరు లీకై కాలువల్లోకి చేరుతోంది. నక్కవానిపాలెంలోని వాటర్ సప్లై కార్యాలయం ఉన్నప్పటికీ.. సిబ్బంది పరిశీలించక పోవడంతో ఈ సమస్య తలెత్తింది. సంబంధిత అధికారులు స్పందించి నీటి లీకేజీని పూర్తిస్థాయిలో అరికట్టాలి.

– నక్కవానిపాలెం వాసులు

రోడ్డు ప్రమాదంలో కాటికాపరికి తీవ్రగాయాలు


గాయపడిన పోలిపిల్లి పైడిరాజు

మల్కాపురం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొబ్బరితోటకు చెందిన పోలిపిల్లి పైడిరాజు జ్ఞానాపురం శ్మశానవాటికలో కాటికాపరిగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో టిఫిన్ చేయడానికి బయటకు వెళ్లి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కంచరపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కాన్వెంట్ కూడలి మీదుగా రైల్వే స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి.. జ్ఞానాపురం జంక్షన్ వద్దకు వచ్చే క్రమంలో రహదారిని అధిగమిస్తున్న పైడిరాజును బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. పైడిరాజు బంధువు ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.వి జయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మొహమ్మద్ బేగం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: రైలు కింద పడి సుమారు 30–35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి సింహాచలం నార్త్ స్టేషన్ సమీపంలో మరణించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో ఎస్‌ఐ బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి వెళ్తున్న 13352 బొకారో ఎక్స్‌ప్రెస్ కింద పడి గానీ, ఇదే రైలు నుంచి జారిపడి గానీ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722 నంబర్‌లో గానీ తెలియజేయాలని కోరారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ


మాధవధారలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మల్కాపురం: మాధవధారలో శనివారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఓ ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న మూల దినేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేసినట్లు విద్యార్థి తండ్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు తెలిపారు. 100 మంది విద్యార్థులు, సభ్యులతో కలిసి క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులతో నినాదాలు చేశారన్నారు. ఆరోగ్యకరమైన బరువును ఉంచుకోవడం, పొగాకుకు దూరంగా ఉండటం, మద్యం పరిమితి చేయడం, చర్మాన్ని రక్షించుకోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లతో క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

'నూతన సామాజిక ఒరవడి'పై వాకథాన్

సీతమ్మధార: ధాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజియన్ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నూతన సామాజిక ఒరవడి అనే అంశంపై వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ థీమ్‌పై ఫౌండేషన్ మహిళలు నినాదాలు చేస్తూ వాక్ నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ పూర్వ డైరెక్టర్ ప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ధాన్ ఫౌండేషన్ రీజనల్ కో ఆర్డినేటర్ శైలజ మాట్లాడుతూ వాకథాన్ థీమ్స్ ఉద్దేశాన్ని సభ్యులందరికీ వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ జానకీరామన్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్, డాక్టర్ భానుప్రకాష్, సమాఖ్య నాయకులు ఆదిలక్ష్మి, గౌరీ, నళిని, లీల, షబీద, రమ, కళంజియా సభ్యులు పాల్గొన్నారు.